క్లుప్తంగా

'రాష్ట్రపతిని అవమానిస్తున్న బీజేపీ'

అశ్వాపురం: భారత పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకుండా ఉద్దేశపూర్వకంగా బీజేపీ ప్రభుత్వం రాష్ట్రపతిని అవమానిస్తోందని ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు పొడియం అనిల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్డులోని కొమరం భీం విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మహిళలను, గిరిజనులను అవమానించే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో గొల్లగూడెం సర్పంచ్ పొడియం సుజాత, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రపతే ప్రారంభించాలి

చండ్రుగొండ: పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగానే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి అవులూరి రామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త సావర్కర్ జన్మదినం రోజు ప్రారంభోత్సవ వేడుక పెట్టుకోవడం సరికాదన్నారు. దేశప్రజల సాధమైన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవం అన్ని రాజకీయ పార్టీల అభీష్టం మేరకు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో గుర్రాయిగూడెం సర్పంచ్ కాక సీత, రామడుగు వెంకటాచారి, రాయి రాజా, కాక వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ రోలర్స్ పంపిణీ



వాటర్ రోలర్స్ అందజేస్తున్న ఎంపీడీఓ అన్నపూర్ణ

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీ, శాంతినగర్ గ్రామ శివారుల్లోని అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గొత్తికోయలకు ఎంపీడీఓ అన్నపూర్ణ వాటర్ రోలర్స్‌లను పంపిణీ చేశారు. శుక్రవారం గొత్తికోయల గ్రామాన్ని ఆమె సందర్శించి 20 కుటుంబాలకు వాటర్ రోలర్స్‌లను అందజేశారు. గ్రామంలోని పంటల గురించి, విద్యార్థుల చదువుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ద్వారా వాటర్ రోలర్స్‌లను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నియంత్రించాలి

అశ్వారావుపేటరూరల్: అనధికారికంగా అమలు చేస్తున్న విద్యుత్ కోతలను తక్షణమే నియంత్రించి, మెరుగైనా విద్యుత్ సరఫరా అందించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు శుక్రవారం స్థానిక ట్రాన్స్‌కో ఏఈఈకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కొన్ని నెలలుగా అశ్వారావుపేట మండలంలో కరెంటు కష్టాలు అధికమైయ్యాయని అన్నారు. ప్రతి రోజూ మరమ్మతుల పేరుతో దాదాపు 8గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని, దాంతో పంటలకు సాగు నీరు అందడం లేదన్నారు. తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె.పాషా, ఎంపీటీసీ సభ్యురాలు వేముల భారతి, నాయకులు జల్లిపల్లి దేవరాజు, తగరం రాజేష్, వెంకన్నబాబు, ఎస్.అంజి, అమర్ నాథ్, రమాదేవి ఉన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

బూర్గంపాడు: భద్రాచలం కోర్టు ఆదేశాను సారం అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఆధ్వర్యంలో శుక్రవారం సారపాకలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ జాజుల రాకేష్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ వైద్యశిబిరంలో రోగులకు ఉచితంగా ఆయుర్వేద మందులను అందించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో అగ్రి లీగల్ సర్వీస్ ప్రతినిధులు పొన్నాల కవిత, ఏఈఓ తుక్కాని రవితేజరెడ్డి, గంగిశెట్టి వీరయ్య, విజయ్‌కుమార్, ఎన్‌జీఓ ప్రతినిధి మిట్టకంటి సంజీవరెడ్డి, రవళి, వేంపల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణపురంలో..

అశ్వాపురం: మండల పరిధిలోని కల్యాణపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఆయుర్వేద మండల వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఆయుర్వేద కరదీపికను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఆయూష్ సిబ్బంది రాధిక తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల ఆశలు గల్లంతు

- మరింత పతనమవుతున్న ధర
- నిండా మునిగిన రైతులు
- ఇప్పటి వరకు అమ్ముకోని వారికి అగచాట్లు



ఓ ఇంట్లో పత్తిని అమ్ముతున్న రైతు

బూర్గంపాడు: పత్తి రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ధర పెరుగుతుందనే ఆశతో పత్తిని నిల్వచేసుకున్న రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. పత్తి ధరలు రోజురోజుకూ పడిపోతుండటం రైతులను కలవరపరుస్తోంది. సీజన్ ఆరంభంలో క్వింటా రూ.8 వేలకు పైగా పలికిన పత్తిధర ప్రస్తుతం రూ.6,500లకు చేరింది. దీంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. నెలల తరబడి పత్తిని నిల్వచేసుకున్న రైతులు ధరల పతనంతో కుదేలవుతున్నారు. ఓ పక్క వానాకాలం పంటల సాగు సమయం ఆసన్నమవుతుండటంతో రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పత్తిధరలు రోజురోజుకూ క్షీణిస్తున్న కొందరు రైతులు పత్తిని తెగనమ్ముకుంటున్నారు. క్వింటాకు రూ.3వేల వరకు నష్టం వాటిల్లుతోంది.

ఈ ఏడాది మణుగూరు, భద్రాచలం వ్యవసాయ డివిజన్‌లలో సుమారు 95వేల ఎకరాలలో పత్తిని సాగు చేశారు. గోదావరి వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు ఎడెనిమిది క్వింటాళ్లకు మించి పత్తి దిగుబడులు రాలేదు. పత్తి సీజన్ ఆరంభంలో క్వింటా పత్తి ధర రూ.8 వేలకు పైగా పలికింది. దీంతో రైతులు పత్తికి మంచి గిట్టుబాటు ధరలు వస్తాయని ఆశించారు.సంక్రాంతికి ముందు క్వింటా పత్తి ధర రూ.8,100 పలికింది. ఆ తరువాత పత్తి ధర కొద్దికొద్దిగా తగ్గుతూ వచ్చింది. దీంతో రైతులు మళ్లీ పత్తి ధర పెరగకపోతుందా అనే ఆశతో రైతులు పత్తిని అమ్మకుండా నిల్వచేసుకున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో పత్తి ధర పెరుగుతుందని ఆశించారు. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి ధరలు తగ్గుతుండటంతో ఇక్కడ కూడా ధరలు తగ్గుతూవచ్చాయి. ఏప్రిల్‌లో పత్తి ధర మార్చి నెలకంటె కొంచెం పెరిగింది. ఏప్రిల్ నెలఖారులో క్వింటా పత్తి ధర రూ.7800లకు చేరింది. ఆర్థిక ఇబ్బందులున్న రైతులు ఆ సమయంలో పత్తిని అమ్ముకున్నారు. కొందరు రైతులు మాత్రం ధర పెరుగుతుందని ఆశతో నిలువ ఉంచారు. మే నెల ఆరంభం నుంచి పత్తి ధర మళ్లీ తగ్గటం ప్రారంభమైంది. రోజుకు వంద, రెండు వందలు తగ్గుతు వచ్చింది. మే నెలాఖరుకు పత్తి ధర క్వింటాకు రూ.6,500లకు చేరింది. ఈ పరిస్థితులు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. జూన్ నెలలో మళ్లీ పత్తి పంటను సాగు చే సే సమయం ఆసన్నమవుతుంది. ఇప్పటి వరకు పత్తి అమ్ముకోకపోవటంతో పంట పెట్టుబడులకు చేసిన అప్పులు, వడ్డీలు పెరిగిపోతున్నాయి.

అక్టోబర్ నుంచి రైతులు పత్తితీతలు ప్రారంభించారు. గిట్టుబాటు ధరల కోసం రైతులు పత్తిని నిలవ్వచేశారు. దాదాపు ఆరు నెలల పైబడి రైతులు తమ ఇళ్లలో పత్తిని నిల్వచేసుకున్నారు. ఇళ్లలో పత్తి నిల్వచేయటంతో అలెర్జీలు సోకి రైతు కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయి.

చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో రైతులు, వారి కుటుంబసభ్యులు ఆస్పత్రుల పాలయ్యారు. అయినప్పటికీ గిట్టుబాటు ధర రాకపోతుందా అనే ఆశతో పత్తిని నిల్వవుంచారు. నెలల తరబడి పత్తిని నిల్వచేయటంతో బరువు కూడా తగ్గిపోతుంది. క్వింటాకు కనీసం ఎడెనిమిది క్వింటాళ్ల మేరా పత్తి బరువు తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. ఎక్కువ రోజులు పత్తి నిల్వవుండటంతో పత్తి రంగు కూడా మారుతుందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు కూడా కొనే పరిస్థితులు లేవని వారు వాపోతున్నారు. గిట్టుబాటు ధర వస్తుందని ఆశించి తీవ్రంగా నష్టపోయే పరిస్థితులున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సీసీఐని రంగంలోకి దింపి పత్తిని మద్దతుధరలకు పత్తిని కొనుగోలు చేయించాలని రైతులు కోరుతున్నారు. ధరల పతనమవుతుండటంతో కొందరు రైతులు తక్కువ ధరలకే పత్తిని తెగనమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితులు రైతులను మరింత కలవరానికి గురిచేస్తున్నాయి.

300 క్వింటాళ్లు నిల్వ ఉంచా

పత్తికి గిట్టుబాటు ధర వస్తుందని మూడు వందల క్వింటాళ్ల పత్తిని నిల్వవుంచాను. రోజురోజుకూ పత్తి ధర పతనమవుతోంది. పత్తిని నిల్వచేయటంతో బరువులో తరుగుదల వచ్చింది. క్వింటాకు ఎనిమిది కిలోల వరకు తరుగుదల వస్తోంది. జనవరిలో 8వేలకు పైగా పలికిన పత్తి ధర ఇప్పుడు రూ.6,500లకు పడిపోయింది. పత్తి ధరలపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి.

– గాదె ప్రభాకర్‌రెడ్డి, పత్తిరైతు, రెడ్డిపాలెం

క్వింటాకు రెండువేలు నష్టపోయా..

వందక్వింటాళ్ల పత్తిని ధర వస్తుందని నిల్వచేశాను. సంక్రాంతి పండుగ తరువాత పత్తి ధర పెరుగుతుందని నిల్వచేస్తే రోజురోజుకు ధర తగ్గుతూ వచ్చింది. అకాల వర్షాలతో నిల్వచేసిన పత్తిని కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డాం. ధర వస్తుందనే నమ్మకం లేకుండా పోయింది. ప్రభుత్వం పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐని తెరిపించాలి.

– భూక్యా బాలాజీ, పత్తిరైతు, నాగినేనిప్రోలు

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



అశ్వారావుపేటరూరల్: గాండ్లగూడెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ, ఎస్సై

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ సీజన్ ఆరంభం కానున్న నేపథ్యంలో కొంతమంది దళారులు, వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తుంటారని వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఓ నవీన్, ఎస్సై బి.రాజేశ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని గాండ్లగూడెం గ్రామంలో శుక్రవారం గ్రామ రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రైతూ లైసెన్స్ ఉన్న వ్యాపారులు, దుకాణాల వద్దే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. బిల్లులను తప్పనిసరిగా పొందాలని, అలాగే వాటి సంచులను భద్రపరుచుకోవాలని కోరారు. రైతులకు ఏలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తే వ్యవసాయ, పోలీస్ శాఖల దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాయుడు, రైతులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

అన్నపురెడ్డిపల్లి: రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుంటలో రజకుల సమస్యలను పరిష్కరించాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి 8 సంవత్సరాలు అయినప్పటికీ రజకుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. జీఓ నంబర్ 190 ప్రకారం 2 లక్షల నుంచి 12 లక్షల వరకు రుణాలను ఫెడరేషన్ ద్వారా అందించాలన్నారు. రజకబంధు ఏర్పాటు చేసి రూ.10 లక్షల రుణాలను అందించాలని, మోడ్రన్ దోబిగాట్ నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హరీష్, పవన్, ప్రదీప్, చిటికెడు మునలయ్య, శివకుమారి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కాలనీలు గోదావరి వరదలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఏడాది గోదావరి వరదలతో సుభాష్ నగర్ కాలనీ, ఏఎంసీ కాలనీ, చప్టా దిగువచ ముదిరాజ్ బజార్, అయ్యప్ప కాలనీ, రెవిన్యూ కాలనీ, అశోక్‌నగర్ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గతేడాది అనుభావాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టి పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో రాజు, శ్యామ్, నాగమణి, పద్మ, అరుణ్, దుర్గ, జశ్వంత్, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోయం ప్రసాద్

దమ్మపేట: స్వచ్ఛ భారత్ ఫేస్–2లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో, ఎంపీపీ సోయం ప్రసాద్ అధ్యక్షతన స్వచ్ఛ భారత్‌పై శిక్షణ కార్యక్రమమును నిర్వహించారు. కార్యక్రమానికి శిక్షకులుగా రేవతి, వలీ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ.. బహిరంగ మల, మూత్ర విసర్జన లేని దిశగా గ్రామ పంచాయతీలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తలను ఇళ్లలోనే వేరుచేసి, తద్వారా తడిచెత్త నుంచి ఎరువులను తయారు చేయాలని అన్నారు. పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, ప్రజలను కూడా భాగస్వామ్యులు అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీఓ రామారావు, సర్పంచ్‌లు కురసం శ్రీను, మడివి దుర్గ, పాశం సుగుణ, వెంకమ్మ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపు ధ్వంసంపై కేసు

దమ్మపేట: కిరాణా షాపును ధ్వంసం చేసిన ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మొండివర్రె కాలనీకి చెందిన కోట సుజాత నాలుగేళ్లుగా గ్రామంలోని రోడ్డుపక్కన చిన్న కిరాణా షాపు నడుపుతోంది. అదే గ్రామానికి చెందిన నడిది నాగరాజు, మంగళగిరి శ్రీరాములు, మంగళగిరి కళావతి, సుందరమ్మ ఈనెల 22వ తేదీ రాత్రి సుజాత, ఆమె కుటుంబ సభ్యులను దూషించడమే కాక షాపును ధ్వంసం చేశారు. ఘటనపై సుజాత ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

మంత్రి పువ్వాడ పర్యటన వాయిదా

అశ్వాపురం: నేడు మండలంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుల అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పర్యటనకు సంబంధించి త్వరలోనే తేదీలను ఖరారు చేస్తారన్నారు. పినపాక నియోజకవర్గంలో మొదట ఈ నెల 8న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటన ఖరారు కాగా ఇప్పటి వరకు పలుమార్లు తేదీలు ప్రకటించాక వాయిదా పడ్డాయి.

జయప్రదం చేయండి

అశ్వాపురం: జిల్లాలో పోడు భూముల సమస్య పరిష్కరించాలని పోడు రైతులకు అండగా నేడు ఇల్లందు క్రాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగే పోడు రైతు భరోసా ర్యాలీని జయప్రదం చేయాలని పొంగులేటి శ్రీనన్న సైన్యం మండల కన్వీనర్ ముత్తినేని వాసు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ ర్యాలీలో మండలంలోని పోడుసాగుదారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రహదారి నిర్మాణానికి వినతి

అశ్వాపురం: అశ్వాపురం–గొందిగూడెం రహదారి అధ్వానంగా ఉండి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, రహదారి నిర్మించాలని శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో కాలువ బజార్ గ్రామస్తులు మణుగూరులో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును కలిసి వినతిపత్రం అందజేశారు. గొందిగూడెం రహదారి గుంతలమయంగా అధ్వానంగా ఉండి చిన్నపాటి వర్షానికి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, దుమ్ము, ధూళితో పిల్లలు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడుతున్నారని కాలువబజార్ గ్రామస్తులు ఎమ్మెల్యే రేగాకు తెలిపారు. ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ ఏఈతో మాట్లాడారు.

'అసైన్‌మెంట్' పట్టాలకు గ్రీన్‌సిగ్నల్



భూముల జాయింట్ సర్వే చేస్తున్న ఆర్‌డీఓ, రెవెన్యూ, అటవీ అధికారులు

అశ్వాపురం: ఎన్నో ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములు సాగు చేసుకుంటున్న గిరిజనుల 1000 ఎకరాల భూమికి పట్టాలు అందించే దిశగా గ్రీన్ సిగ్నల్ వచ్చింది. మండల పరిధిలోని తుమ్మలచెరువు, మామిళ్లవాయి రెవెన్యూ గ్రామాల్లో 27, 71 సర్వే నంబర్లలో సుమారు వెయ్యి ఎకరాల్లో గిరిజనులు తాతల కాలంగా భూములు సాగుచేసుకుంటున్నారు. భూములకు అసైన్‌మెంట్ పట్టాలకు సంబంధించి రెవెన్యూ, ఫారెస్ట్ భూములో నిర్ధారణ కాక పట్టాలు ఇవ్వలేదు. దీంతో గిరిజనులు ఎన్నో ఏళ్లుగా అధికారులు, నాయకులకు వినతులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం భద్రాచలం ఆర్‌డీఓ రత్న కల్యాణి పర్యవేక్షణలో రెవెన్యూ, ఫారెస్ట్, వైల్డ్ లైఫ్ అధికారులు తుమ్మలచెరువు, మామిళ్లవాయి గ్రామాల్లో వెయ్యి ఎకరాల భూములను జాయింట్ సర్వే నిర్వహించారు. రెవెన్యూ, ఫారెస్ట్ భూముల హద్దులు గుర్తించారు. 1000 ఎకరాల భూములు ఫారెస్ట్, వైల్డ్‌లైఫ్‌లో లేవని రెవెన్యూ భూములుగా జాయింట్ సర్వేలో గుర్తించారు. దీంతో గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. సర్వే నివేధిక ఆధారంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల రీ అసైన్‌మెంట్ చేసి పట్టాలు ఇవ్వనున్నారు. మండల పరిధిలోని ఎలకలగూడెం గ్రామంలో గతంలో రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్‌లో సేకరించిన 90 ఎకరాల భూములను రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. ఈ 90 ఎకరాలను సీతారామ ప్రాజెక్ట్‌లో సేకరించిన ఫారెస్ట్ భూములకు బదులుగా ఇచ్చేందుకు అధికారులు పరిశీలించారు. గతంలో సరైన నష్టపరిహారం ఇవ్వలేదని కొందరికి ప్యాకేజీ కూడా ఇవ్వలేదని ఇప్పుడు భూములు తీసుకోవడం సరికాదని అధికారులకు విన్నవించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

మణుగూరురూరల్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సూచించారు. మణుగూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.చంద్రమౌళి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతగా పనిచేస్తూ సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకోవాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని చెప్పారు.

వచ్చేనెల 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ పోశం నరసింహారావు, తహసీల్దార్ కె.నాగరాజు, వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని పీ.వీ.కాలనీలో ఉన్న అమీరున్ మదరసా ఉర్దూ స్కూల్‌ను కాంతారావు పరిశీలించగా.. అభివృద్ధికి సహకరించాలని ముస్లిం మైనార్టీ పెద్దలు విజ్ఞప్తి చేశారు. కాగా, క్షౌర వృత్తిదారులకు రుణాలు మంజూరు చేయాలని, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ సొసైటీకి చైర్మన్‌ను నియమించాలనే తదితర సమస్యలపై క్షౌరవృత్తిదారులు విప్ కాంతారావు వినతిపత్రం అందజేయగా ఆయన సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంఘం సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.వెంకటేశ్వరరావుతో పాటు లింగంపల్లి నాగేశ్వరరావు, రాచకొండ శ్రీనివాస్, దడిగల కొండయ్య, మాడుగుల సమ్మయ్య, భద్రయ్య, సాయికుమార్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని నాలుగో వార్డ్ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. గొల్ల బజారులో పగిలిపోయిన రోడ్డుకు మరమ్మతులు, వీధిలో కొంతమేర పోయిన డ్రెయినేజ్ నిర్మాణం, ఇందిరా మార్కెట్‌లో డ్రెయిన్ నిర్మాణం, పాత ఎస్‌బీసీ కార్యాలయం ఎదుట ఉన్న కల్వర్టును స్లోప్ చేయడం, పక్కనే శిథిలమైన డ్రెయినేజీ స్థానంలో కొత్తదానిని నిర్మించడం, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేయడం వంటి డిమాండ్లను కార్యదర్శి ముందు ఉంచారు. రెండు రోజుల తరువాత ఆయా సమస్యలను స్వయంగా చూసి పరిష్కారించేందుకు కృషి చేస్తానని కార్యదర్శి చెప్పినట్లు జోన్ కమిటీ సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, మాజీ 4వ వార్డ్ మెంబర్, జోన్ కన్వీనర్ బండారు శరత్, వార్డువాసులు ఇడా రాంప్రసాద్, రామోజీ రాముడు, రేపాక రాంబాబు, పద్మనాభుని రవి కుమార్, పి.వరబాబు, చలవాది మధు జి.రవి, చలవాది ప్రసాద్, యు.శ్రీనివాసరావు, జీనుగు నాగేందర్ రావు, సంక వెంకట్ నగేష్ పాల్గొన్నారు.

పాలీసెట్‌లో సత్తా చాటిన చర్ల విద్యార్థి



తల్లిదండ్రులతో నిఖిల్

చర్ల: మండలంలోని సాయినగర్‌కు చెందిన కాకర్ల నిఖిల్ శుక్రవారం విడుదలైన పాలీసెట్ ఫలితాల్లో సత్తా చాటాడు. ఆయన ఎంబైపీసీలో 209వ ర్యాంక్, ఎంపీసీ విభాగంలో 214వ ర్యాంకు సాధించాడు. చర్లలోని రాహైల్ విజ్ఞాన్ విద్యాలయం, పాలేరులోని నవోదయ విద్యాలయ చదివిన ఆయన పదో తరగతిలో 10 జీపీఏ సాధించి నవోదయ పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా నిఖిల్‌ను తల్లిదండ్రులు వెంకన్నబాబు–సమత తదితరులు అభినందించారు.

రోటరీ క్లబ్ ఆర్థికసాయం

బూర్గంపాడు: సారపాకకు చెందిన వెంకటకృష్ణ కిడ్నీ సంబంధిత వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటుండగా.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా రూ.10 వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందించింది. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎస్ సూర్యభాస్కర్, రోటరీ ప్రతినిధులు శ్యామ్‌కిరణ్, చెంగలరావు, విష్ణుదత్, ఎస్ సత్యనారాయణ, సాయిరామ్, ఖాదర్‌వలి, చాంద్‌బాషా, చంద్రశేఖర్ యాగి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మొబైల్ కోర్టుకు రెగ్యులర్ మేజిస్ట్రేట్‌ను నియమించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం కోరారు. ఈమేరకు శుక్రవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు సత్వర ఉచిత న్యాయం అందించాలనే సదుద్దేశంతో సంచార న్యాయస్థానం ఏర్పాటైందని తెలిపారు. కానీ నిధుల మంజూరు లేక, రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.


విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న సభ్యులు

దమ్మపేట: ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల కేంద్రంలోని రైతువేదికలో యాదవ సంఘం తరపున సన్మానించి, అభినందనలు తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన యాదవ సంఘానికి చెందిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు తాళ్ల తేజ, రాగం మనోజ్, మానికల స్వరూప, శ్రీలక్ష్మి తదితర విద్యార్థులను సన్మానించారు యాదవ సంఘ నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, మచ్చా శ్రీనివాసరావు, జోనెబోయిన శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, రాధక్రిష్ణ, సాయిల నర్సీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా



బస్‌పాస్‌లు అందజేస్తున్న డిపో మేనేజర్, ప్రజాప్రతినిధులు

దమ్మపేట: మండల కేంద్రంలో సత్తుపల్లి ఆర్‌టీసీ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు.

శుక్రవారం దమ్మపేట గ్రామంలో చిన్నశెట్టి పవన్ ట్రస్ట్ సహకారంతో, సత్తుపల్లి డిపో మేనేజర్ రాజలక్ష్మి దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందజేశారు. దమ్మపేటలోని బస్టాండ్‌కు బస్సుల రాకపోకల గూర్చి డిపో మేనేజర్‌కు గ్రామస్తులు వినతి పత్రము అందజేశారు. సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, చిన్నశెట్టి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.